# తెలుగు జాతికి వన్నె తెచ్చిన అక్కినేని

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్
- అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో
- ఏలూరులో 4వ అంతర్జాతీయ పురస్కార ప్రదానోత్సవం

ఏలూరు టౌన్: డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు అంతర్జాతీయ స్థాయిలో మహానటుడుగా కీర్తి సాధించి తెలుగుజాతికి వన్నె తెచ్చారని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ పేర్కొన్నారు. 'అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా' ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఏలూరులోని శ్రీ కన్వెన్షన్‌లో నిర్వహించిన 4వ అంతర్జాతీయ పురస్కార ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చరిత్ర సృష్టించేవారే సమాజంలో మేధావులుగా కీర్తించబడతారని ఆ కోవలో అక్కినేని అగ్రగణ్యులుగా ఉంటారని కొనియాడారు. సినీ పరిశ్రమ మద్రాసులో ఉన్న సమయంలో తెలుగువారికి ప్రత్యేకంగా చిత్ర రంగం ఉండాలనే కాంక్షతో హైదరాబాద్ వచ్చి స్టూడియో కట్టిన మొదటి వ్యక్తి అక్కినేని అని చెప్పారు. ఈ సందర్భంగా అక్కినేనితో అనుబంధాన్ని జస్టిస్ చలమేశ్వర్ గుర్తు చేసుకున్నారు.

### 9 మందికి పురస్కారాల ప్రదానం

హైకోర్టు న్యాయమూర్తి కె.విజయలక్ష్మి, మేయర్ నూర్జహాన్ అక్కినేని కుమార్తె నాగసుశీల జ్యోతి ప్రజ్వలన చేసి అక్కినేని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్ఫూర్తి ప్రదాతలుగా నిలిచిన 9 మందికి పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్ తోటకూర, అధ్యక్షుడు డాక్టర్ సీఆర్ రావు, ఉపాధ్యక్షుడు రావు కల్వల, ఏలూరు ఎమ్మెల్యే బడేటి బుజ్జి, జడ్పీ చైర్మన్ ఎం.బాపిరాజు, కలెక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### పురస్కార గ్రహీతలు వీరే...

జీవనసాఫల్య పురస్కారం: డాక్టర్ కాశీనాధుని విశ్వనాథ్
విద్యారత్న: డాక్టర్ ఎంవీవీఎస్ మూర్తి



పురస్కారాల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న జస్టిస్ చలమేశ్వర్

సినీ రత్న: డాక్టర్ గొల్లపూడి మారుతీరావు
రంగస్థలరత్న: వంగపండు ప్రసాదరావు, వ్యాపారరత్న: డాక్టర్ వీవీ బాలకృష్ణారావు
వైద్యరత్న: డాక్టర్ గుడారు జగదీష్ , సేవారత్న: మాయలూరి మనోహర్‌రెడ్డి, వినూత్న రత్న: షాకీర్ మహ్మద్,
యువరత్న: కెప్టెన్ అన్నే దివ్య

## కవి నర్సిరెడ్డికి 'ఎక్సరే' అవార్డు

విజయవాడ కల్చరల్: ఎక్సరే సాహిత్య సేవా సంస్థ జాతీయ స్థాయిలో నిర్వహించిన కవితల పోటీలో సీనియర్ కవి యాములపల్లి నర్సిరెడ్డి రచించిన 'భవన నిర్మాణ కార్మికుడు' కవితకు జాతీయ ఎక్సరే పురస్కారం లభించినట్లు సంస్థ అధ్యక్షుడు కొల్లూరి శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో విజయవాడలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో రూ.10 వేల నగదుతోపాటు జ్ఞాపికను ప్రధానం చేస్తామన్నారు. ఉత్తమ కవితలు రచించిన మరో పదిమంది కవులకూ పురస్కారాలు అందిస్తున్నామన్నారు. హైమావతి సత్య(వేల్పూరి), పర్కపల్లి యాదగిరి (సిద్ధిపేట), కొండా మల్లారెడ్డి (సిద్దిపేట), ఈ. రాఘవేంద్ర (రాయదుర్గం), కిలపర్తి దాలినాయుడు(సాలూరు), మానస్ (సత్తెనపల్లి), నిరంతర చిత్తలూరి(హైదరాబాద్), కప్పగంతు అమూల్య, పీవీజీ కృష్ణంరాజు (విజయవాడ), నరసింహస్వామి (నిజామాబాద్)లను ఎంపిక చేసినట్టు వివరించారు.